సంక్షామ వసతిగృహాలు

సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు తిష్టవేశాయి. కూటమి ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోకపోవడంతో కనీస సౌకర్యాలు కరువై విద్యార్థులు అవస్థ పడుతున్నారు. ఇటీవల రాష్ట్రంలోని సంక్షేమ వసతిగృహాల్లోని దుస్థితిపై రాష్ట్ర హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను 'సాక్షి' పరిశీలించగా పలు సమస్యలు వెలుగుచూశాయి. కొన్ని చోట్ల వసతిగృహాలు శిథిలావస్థకు చేరి శ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. మరికొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా గదులు లేవు. స్నానపు గదులు లేక విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. మరుగుదొడ్లు తగినన్ని లేకపోవడం.. ఉన్నా శుభ్రం చేసే వారు లేక కంపు కొడుతున్నాయి. వసతిగదులకు తలుపులు, కిటికీలు లేవు.దోమల మెస్‌లు సైతం దెబ్బతిని దోమలు దండయాత్ర చేస్తున్నాయి. వసతిగృహాలను తెరిచి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు దుప్పట్లు ఇవ్వకపోవడంతో చలి, దోమలకు విద్యార్థులు నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నారు.



కలిగిరి: శిథిలావస్థకు చేరిన సిద్ధనకొండూరు హాస్టల్

బిక్కుబిక్కుమంటూ..



బీసీ హాస్టల్‌లో పెచ్చులూడిన శ్లాబ్

కొండాపురం : కొండాపురంలో బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఎస్సీ హాస్టల్‌లో 60 మంది, బీసీ వసతి గృహంలో 40 మంది వసతి పొందుతున్నారు. ఎస్సీ వసతిగృహానికి అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ భవనం ఉంది. బీసీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుంటూ వసతి పొందుతున్నారు. భవనం దుస్థితిని చూసి భయంతో కొందరు విద్యార్థులు వెళ్లిపోతున్నారు. భవనం బాగుంటే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

దోమలతో జాగారం



కలిగిరి: సిద్ధనకొండూరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 22 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం రెండు గదుల్లో మాత్రమే విద్యార్థులు ఉంటున్నారు. ఆ గదులకు కూడా కిటికీలు సక్రమంగా లేవు. దోమల మెస్‌లు సైతం పాడయ్యాయి. హాస్టల్ తెరిచి రెండు నెలలు గడిచినా విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు చలికి వణుకుతూ దోమల కాటుతో జాగారం చేస్తున్నారు. వసతి గృహ మరమ్మతులకు కలెక్టర్ నిధులు రూ. 6 లక్షలు మంజూరైనా గతంలో పనిచేసిన వార్డెన్, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది.



ప్రహరీ లేని బీసీబాలుర వసతిగృహం

విషసర్పాలతో సహవాసం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని బీసీ బాలుర వసతిగృహంలో 70 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వసతిగృహం చుట్టూ ప్రహరీని నిర్మించకపోవడంతో ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళల్లో విషసర్పాలతో సహవాసం చేయాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.

పాత ట్రంకు పెట్టెలే దిక్కు



సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లి, సీతారామపురంలో బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. వసతి భవనాలు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక వర్షాకాలంలో ఉరుస్తున్నాయి. సీతారాంపురంలోని హాస్టల్‌లో మరుగుదొడ్లకు పైకప్పు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. గత పదేళ్లుగా విద్యార్థులకు ట్రంకుపెట్టెలు అందించడం మానేశారు. అలాగే దుప్పట్లు, కార్పెట్లు కూడా నేటి వరకు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకుని కప్పుకుంటున్నారు. వంటమనిషి, వాచ్‌మెన్, కామాటి లేరు. వార్డెన్ బయట వ్యక్తులతో వంట చేయిస్తుండడంతో మెనూ అమలు కావడం లేదు.

అమలు కాని మెనూ..



ఉప్మా బదులు కిచిడీ వడ్డిస్తున్న దృశ్యం

దుత్తలూరు: సంక్షేమ వసతిగృహాల్లో మెనూ అమలు కావడం లేదు. నందిపాడు బీసీ బాలుర వసతి గృహంలో 60 మంది విద్యార్థులకు 40 మంది మాత్రమే అల్పాహారానికి హాజరయ్యారు. మెనూ ప్రకారం గోధుమరవ్వతో ఉప్మా, వేరుశనగల చట్నీ ఇవ్వాల్సి ఉండగా, కిచిడీ వడ్డించారు. ఈ విషయమై వార్డెన్‌ను అడుగగా, విద్యార్థులు ఉప్మా తినడానికి ఇష్టపడరని, అందుకే కిచిడీ చేయించామని తెలిపారు. విద్యార్థులకు మినరల్ వాటర్‌కు బదులుగా బోరు నీటినే మంచినీరుగా అందిస్తున్నారు. హాస్టల్ శ్లాబు సైతం పెచ్చులూడి వర్షానికి ఉరుస్తోంది. వార్డెన్ కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని తెలిసింది.

అపరిశుభ్రంగా మరుగుదొడ్లు



అపరిశుభ్రంగా మరుగుదొడ్డి

వరికుంటపాడు: మండలంలోని కాకొల్లువారిపల్లి బాలుర వసతి గృహంలో సుమారు 30 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వసతిగృహంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కుళాయిలు, స్నానపు గదులు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. వసతి గదుల్లో దీపాలు సక్రమంగా వెలగడం లేదు. కిటికీలకు తలుపులు లేవు. దోమల మెస్‌లు సైతం చిరిగిపోయి ఉన్నాయి. హాస్టల్ తెరిచి రెండు నెలలు కావస్తున్నా దుప్పట్లు, పెట్టెలు పంపిణీ చేయలేదు.

181 మందికి ఐదు గదులే..



అల్లూరు: స్థానిక ఆర్డీఆర్ కాలనీలోని బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదు గదులు ఉండగా 181 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఒకే గదిని వసతికి, తరగతులకు వినియోగిస్తున్నారు. వసతిగృహంలో 240 సీట్లు ఉండగా, గదుల కొరతతో పడుకునేందుకు వీల్లేక చేరేందుకు వచ్చిన విద్యార్థులు వెనుదిరుగుతున్నారు. ఇటీవల అల్లూరు పర్యటనకు వచ్చిన కలెక్టర్ గురుకుల పాఠశాలను పరిశీలించి గదుల సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఆరుబయటే స్నానాలు

ఉదయగిరి: వింజమూరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 76 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్ల లేవు. దీంతో విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం వసతిగృహ మరమ్మతుల కోసం రూ.6.40 లక్షలు కేటాయించింది. కానీ పనుల్లో నాణ్యత లేదని విద్యార్థులు చెబుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నలభై రోజులు గడిచినా ఇంత వరకు విద్యార్థులకు పెట్టెలు, దుప్పట్లు ఇవ్వలేదు.వింజమూరులోని బీసీ వసతి గృహంలో 34 మంది విద్యార్థులు ఉన్నారు. వసతిగృహ మరమ్మతులకు రూ.2.5లక్షలు కేటాయించిన ఇంకా పనులు చేపట్టలేదు. ఇక్కడ భోజనశాల లేకపోవడంతో విద్యార్థులు నిద్రించే గదిలోనే భోజనం చేస్తున్నారు. వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వసతిగృహ మరమ్మతులకు రూ.2.5లక్షలు కేటాయించినా ఇంకా పనులు చేపట్టలేదు.వింజమూరులోని



వింజమూరు ఎస్సీబాలుర హాస్టల్‌లో ఆరుబయటే స్నానం చేస్తున్న విద్యార్థులు

వైఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని కళాశాల బాలికల వసతి గృహంలో కనీస వసతులు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు.

54 మందికి మూడే ..

సోమశిల: అనంతసాగరం మండలంలో నాలుగు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఒక ఎస్సీ గురుకులం ఉన్నాయి. అనంతసాగరంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 54 మంది విద్యార్థులు ఉండగా, మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవస్థ పడుతున్నారు. వసతిగృహాలను తెరిచి రెండునెలలు గడుస్తున్నా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో నేలపైనే చలికి వణుకుతూ పడుకుంటున్నారు. మరో వైపు వసతిగృహం పాఠశాలకు దూరంగా ఉండడంతో నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



వింజమూరు బీసీ బాలుర హాస్టల్‌లో నిద్రించే గదిలోనే భోజనం చేస్తున్న విద్యార్థులు

అద్దె రేకుల గృహంలో అవస్థ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు అధ్వానంగా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో బాలబాలికల గురుకుల పాఠశాలలు 2, ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలు 4, బీసీ కళాశాల విద్యార్థుల వసతి గృహం ఒకటి చొప్పున ఏడు ఉన్నాయి. ఇందులో బీసీ కళాశాల బాలుర హాస్టల్‌ను అద్దె రేకుల గృహంలో నిర్వహిస్తున్నారు. ఇందులో 40 మందికి గానూ 26 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. రేకుల గృహంలో ఏడు గదులు ఉండగా వర్షానికి ఉరుస్తున్నాయి. అందులో ఒక గది ఎక్కువగా ఉరుస్తుండడంతో మిగిలిన గదుల్లో విద్యార్థులు సర్దుకుంటున్నారు. దీనికి తోడు మూడు



ఆత్మకూరు: అద్దె రేకుల గృహంలో నిర్వహిస్తున్న బీసీ కళాశాల బాలుర హాస్టల్

వైపులా మురుగు కాలువలు ప్రవహిస్తుండడంతో దుర్గంధంతో పాటు పందులు, దోమల బెడదతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అర్జీలు ఇచ్చినా ఫలితం లేదు



ఆత్మకూరులో బీసీ కళాశాల బాలుర హాస్టల్ అధ్వానంగా ఉంది. వర్షాకాలంలో విద్యార్థులు విష పురుగులు, పందులు, దోమల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనం దుస్థితిపై పలుమార్లు బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్‌ను పక్కా భవనంలోకి మార్చాలి.

–ఎస్‌కే ఖాదర్‌బాషా, ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు, ఆత్మకూరు

క్లుప్తంగా

అబ్దుల్‌కలాంకు నివాళి



ఉదయగిరి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. కలాంను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. పార్టీ నాయకులు కొండా రాజగోపాల్‌రెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి,అక్కి భాస్కర్ రెడ్డి, దస్తగిరి అహ్మద్, రమణారెడ్డి, వీరారెడ్డి, షంషీర్, దారపునేని చెన్నయ్య, బాబు, సలీం, తదితరులు పాల్గొన్నారు.

అలఘునాథుని పుష్కర కుంభాభిషేకానికి ఆహ్వానం



ఆత్మకూరు: పట్టణంలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో వచ్చే నెల 5,6,7 తేదీల్లో జరగనున్న పుష్కర కుంభాభిషేక మహోత్సవానికి రావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం కలిసి ఆహ్వానించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ యానాదిరెడ్డి, ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, రామయ్యస్వామి, కమిటీ సభ్యులు కేవీ శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, పీ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ నిరసన

ఉదయగిరి: విజయవాడలోని ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఉదయగిరి ఆర్టీసీ డిపో ఎదుట రెండోరోజు ఆదివారం ఆ యూనియన్ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీనియర్ నాయకులు సలాం, శంకర్, నాగరాజు, సూరి, రామాంజనేయులు, డిస్పాచ్ శ్రీను, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, డీఎస్ రావు మధు, మహేశ్వరమ్మ, సుజాత,, షరీఫ్, హుస్సేనయ్య, ఎస్ఎంకే రెడ్డి, జయంతు, రమణారెడ్డి, మధు, జయశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 1974–75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం పాఠశాలకు మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ సమావేశంలో పూర విద్యార్థులు టీ భాస్కర్‌రెడ్డి, కే శ్రీనివాస్‌మూర్తి, షణ్ముగం, దర్శి సుబ్బారావు, రాజారావు, నరసింహారావు, రాజా, శ్రీను, గణపం భాస్కర్‌రెడ్డి, లెక్కల గిరి, చెవుల పెద్దకృష్ణ, కాకుటూరి రాజారావు, హెచ్ఎం మాలకొండయ్య పాల్గొన్నారు.

ఘనంగా పెంచలస్వామి ఆరాధన మహోత్సవం



ఆత్మకూరురూరల్: దేపూరులో హనుమాన్ భక్త పెంచలస్వామి 35వ ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన సతీమణి నాయుడు లక్ష్మమ్మ, కుమారులు నాయుడు భాస్కర్ నాయుడు, పెంచలనాయుడు దంపతులు పెంచలస్వామి సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేపూరు కూడలిలోని అభయాంజనేయస్వామి శిలావిగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కర్లం వెంకట సుబ్బయ్య, దొడ్ల సుమన్, తూమాటి తిరుపతి నాయుడు, రావిళ్ల ఆదిశేషయ్య, తదితరులు పర్యవేక్షించారు.

బీఎస్పీ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు టీ కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణ ఇన్‌చార్జిగా బీ తేజేంద్రనాథ్, సంగం మండల ఉపాధ్యక్షుడుగా దొడ్ల ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా నియమించారు. పార్టీ నాయకులు శేషాద్రి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వినతుల స్వీకరణ

సోమశిల: చేజర్ల మండలం పెరుమాళ్లపాడులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి రామనారాయణరెడ్డి ప్రజాసమస్యలపై ఆదివారం వినతి పత్రాలను స్వీకరించారు. పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలను ఇవ్వగా పరిశీలించి పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు.

పొగాకు సాగు నియంత్రణను పాటించాలి

కలిగిరి: 2025–26 పంట కాలానికి సంబంధించి పొగాకు సాగు నియంత్రణను రైతులు పాటించాలని కలిగిరి పొగాకు వేలం కేంద్రం క్షేత్ర సహాయకులు సూచించారు. కలిగిరి, కొండాపురం, దుత్తలూరు మండలాల్లో ఆదివారం వారు పర్యటించారు. పొగాకు సాగు నియంత్రణపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ గ్రేడు పొగాకు అమ్మకాలు, అధీకృత పొగాకు అమ్మకాల ముగింపుపై చర్చించారు. నేల సారాన్ని మెరుగుపరచడానికి పొగాకు నాణ్యతను పెంచడానికి పచ్చిరొట్ట ఎరువులను వినియోగించి పంటలను సాగు చేయాలని సూచించారు. 2025– 26 పంట సీజన్‌కు పరిమితి మేరకు మాత్రమే పంటను సాగుచేయాలని తెలిపారు. వేలం నిర్వహణాధికారి వీ శివకుమార్, ఫీల్డ్‌ఆఫీసర్ సంతోష్, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



పొగాకు నియంత్రణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పొగాకుబోర్డు అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన రమణారెడ్డి

సీతారామపురం : మండలంలోని పెదనాగంపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నాగంపల్లెకు చెందిన మునగల రమణారెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రమణారెడ్డి తన మోటార్‌సైకిల్‌పై కుమార్తెను ఎక్కించుకుని సీతారామపురం నుంచి చిన్నాగంపల్లెకు వెళ్తుండగా మార్గం మధ్యలో పెదనాగంపల్లి వద్ద వీధికుక్కలు ఒక్కసారిగా అడ్డువచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో మోటార్‌సైకిల్ అదుపు తప్పి కింద పడడంతో రమణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. కుమార్తెకు ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో సీతారాంపురం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

ధర్మస్థల ఉదంతంపై సమగ్ర విచారణ చేపట్టాలి



ఆత్మకూరు: కర్ణాటకలోని ధర్మస్థల క్షేత్రం ఉదంతంపై సమగ్ర విచారణ జరపాలని న్యాయవాది కేవీ శేషారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఎస్సార్ సెంటర్‌లో ధర్మస్థల క్షేత్రంలో హత్యాచారాలు జరిగాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో న్యాయవాది శేషారెడ్డి, లక్కు ప్రసాద్ ఆధ్వర్యంలో బహిరంగ చర్చ, ప్రజాభిప్రాయ సేకరణను ఆదివారం నిర్వహించారు. ధర స్థల ఉదంతంపై న్యాయబద్ధమైన విచారణ జరిపి తెరవెనుక ఎంత పెద్ద వారు ఉన్నా కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్: మండలంలోని గంగులవారి చెరువుపల్లెకు చెందిన టీ చినపెంచలయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చెన్నైలోని విజయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లు వైద్యం కోసం స్వగ్రామంలోని కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ తరఫున నాయకుడు కే వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ తరఫున న్యాయవాది కాకు మురళీకృష్ణ రూ.10 వేలు చొప్పున నగదును ఆదివారం అందజేశారు.

వైభవంగా దువ్వూరమ్మకు పల్లకిసేవ



సంగం: మండలంలోని దువ్వూరులో కొలువైన దువ్వూరమ్మ ఆలయంలో 26వ వార్షిక వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, అనంతరం అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పల్లకి సేవ జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే కోలగట్లలో పెన్నానది తీరంలో కొలువైన నాగవరపమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

స్త్రీల ప్రావీణ్యాన్ని గుర్తించాలి



మాట్లాడుతున్న వేలూరు భారతి

ఆత్మకూరు: కుటుంబాన్ని తీర్చిదిద్దడంతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న స్త్రీల ప్రావీణ్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు పండింట్ డాక్టర్ వేలూరు భారతి అన్నారు. తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో మేధా పాఠశాలలో మంచి మాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన భారతి మాట్లాడుతూ ''మానవ పరిణామ క్రమంలో స్త్రీపాత్ర'' అన్న అంశంపై ప్రసంగించారు. పిల్లలను కని పెంచడంతో పాటు శారీరిక కష్టం అనుభవిస్తూ కుటుంబ అభివృద్ధి కోసం మహిళలు విశేష కృషి చేస్తారన్నారు. ఒక జాతి ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందాలంటే స్త్రీల పాత్ర ముఖ్యమైందన్నారు. సమాజ నిర్మాణం, సంస్కృతి పరిరక్షణతో స్త్రీల పాత్ర ప్రముఖమైందన్నారు. అనంతరం పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవా సమితి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు సోమవరపు యానాదిరెడ్డి, గోవిందరెడ్డి, కే వెంకటేశ్వర్లు, ఎస్వీ రమణయ్య, కేవీ శేషారెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, యానాదిరెడ్డి, రవీంద్ర, అపర్ణ చక్రవర్తి, జయమ్మ, పలువురు విశ్రాంతి ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుపై పునఃసమీక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ఉదయగిరి రూరల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం కొత్తగా ఉదయగిరి జిల్లా ఏర్పాటుపై పునఃసమీక్షించాలని ఉదయగిరి జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు కే వేణుగోపాల్ కోరారు. ఉదయగిరిలోని ఐటీఐ కళాశాలలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ఉదయగిరి నియోజకవర్గంపై ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు. చరిత్రపరంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఉదయగిరి స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నిరాదరణకు గురైందన్నారు. ప్రజా సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికీ స్వాతంత్య్రం నాటి సింగిల్ రోడ్లతో ప్రజలు నానాయాతన పడుతున్నామన్నారు. వెలిగొండ, సోమశిల, గండిపాళెం ప్రాజెక్టులు దశాబ్దాలుగా ఆయకట్టు రైతులను నిరాశకు గురిచేస్తున్నాయన్నారు. ఉదయగిరి ప్రాంతంలోని 20 మెట్ట మండలాలను కలిపి జిల్లాగా ఏర్పాటు చేసి సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు. పూర్వ ఉద్యోగుల ఉపాధ్యాయుల సంఘం ఉదయగిరి తాలుకా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు కే చంద్ర శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.